సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం । 26 । మార్చి । 2023



కొలువుదీరిన పాలకవర్గం

15 మంది సభ్యులతో కూడిన పెద్దమ్మతల్లి ఆలయ కమిటీ నూతన పాలకవర్గం శనివారం ప్రమాణ స్వీకారం చేసింది. 8లో




116 కేజీల గంజాయి స్వాధీనం

ఒడిశా నుంచి హైదరాబాద్ తరలిస్తున్న 116 కేజీల గంజాయిని కొత్తగూడెంలో ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
33° / 23°

వాతావరణం

జిల్లాలో ఆదివారం ఉష్ణోగ్రత అధికంగానే ఉంటుంది. ఉదయం నుంచి గంటగంటకూ ఎండ ప్రభావం పెరుగుతుంది.



న్యూస్‌రీల్

ఘనంగా శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణం



కల్యాణ తంతు నిర్వహిస్తున్న అర్చకులు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణాన్ని శనివారం ఘనంగా జరిపించారు. ఆలయంలో శ్రీస్వామి వారికి ఉదయం పంచామృతాభిషేకం, అర్చన, ఇతర ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ప్రధానార్చకుడు ప్రసాదాచార్యులు వేద మంత్రాల నడుమ స్వామివారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు.

పెద్దమ్మతల్లికి లక్ష కుసుమార్చన



అమ్మవారికి కుసుమార్చన చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి ఆలయంలో శ్రీ దేవీ వసంత నవరాత్రి వేడుకల్లో భాగంగా శనివారం అమ్మవారికి లక్ష కుసుమార్చన నిర్వహించారు. అనంతరం శ్రీచక్రార్చన, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, నాద నీరాజనం, నివేదన, హారతి, నీరాజన మంత్రపుష్పం, వేదగోష్ఠి తదితర కార్యక్రమాలను అర్చకులు వైభవోపేతంగా జరిపించారు.

ప్రజలకు సేవ చేయడం వరం: ఎస్పీ వినీత్



మాట్లాడుతున్న ఎస్పీ వినీత్

కొత్తగూడెంటౌన్: పోలీసు శాఖలో పని చేస్తూ ప్రజలకు సేవ చేయడం గొప్ప వరమని ఎస్పీ వినీత్ అన్నారు. పట్టణంలోని ఐఎంఏ హాల్‌లో కానిస్టేబుల్, ఎస్సై అభ్యర్థులకు నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అన్ని దశలను దాటి మెయిన్స్ వరకు వచ్చిన ప్రతి ఒక్కరూ ఉద్యోగం సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న 100 మంది అభ్యర్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో శ్రీమేధ స్టడీ సర్కిల్ చైర్మన్ శివప్రసాద్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ విజయ్‌బాబు, డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, ఆర్‌ఐలు నాగేశ్వరావు, కామరాజు, సుధాకర్ పాల్గొన్నారు.

ఏర్పాట్లు ముమ్మరం

రామాలయంలో ఊపందుకున్న నవమి పనులు

- లడ్డూల తయారీ ప్రక్రియ ప్రారంభం
- పట్టాభిషేకానికి గవర్నర్ పర్యటన ఖరారు
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఈఓ

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో మరో నాలుగు రోజుల్లో శ్రీ సీతారాముల కల్యాణం, ఆ తెల్లవారి పుష్కర సామ్రాజ్య పట్టాభిషేకం వేడుకలు జరగనున్నాయి. ఇందుకోసం ఆలయ ప్రాంగణంతో పాటు పరిసర ప్రాంతాల్లో ఏర్పాట్లు జోరందుకున్నాయి. మిథిలా స్టేడియంలో షామియానాలు, చలువ పందిళ్ల నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. దేవస్థానానికి పూర్తిస్థాయిలో విద్యుదీకరణ పనులు పూర్తి కావచ్చాయి. నవమి ఏర్పాట్ల పనులను కలెక్టర్ అనుదీప్, ఆలయ ఈఓ ఎల్.రమాదేవి శనివారం పరిశీలించారు.

రెండు లక్షల లడ్డూలు..

శ్రీరామనవమికి వచ్చే భక్తుల కోసం రెండు లక్షల లడ్డూలు తయారు చేయాలని అధికారులు భావిస్తున్నారు. తానీషా కల్యాణ మండపంలో లడ్డూల తయారీ ప్రక్రియ శనివారం ప్రారంభమైంది. దేవస్థాన సిబ్బందితో పాటు విజయవాడ నుంచి వచ్చిన కార్మికులు లడ్డూలు సిద్ధం చేస్తున్నారు. ఏపీ, తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన స్వచ్ఛంద సంస్థల సభ్యులు తలంబ్రాలు తయారు చేస్తున్నారు. దాతలు సమర్పించిన మిషన్లతో ఈ ఏడాది తొలిసారిగా ముత్యాల తలంబ్రాలను ప్యాకింగ్ చేస్తున్నారు.

31న రానున్న తమిళి సై !

ప్రతి ఏడాది శ్రీరామ నవమి తెల్లవారి జరిగే పట్టాభిషేక మహోత్సవానికి గవర్నర్ హాజరు కావటం పరిపాటి. కాగా, ఈనెల 31న పుష్కర సామ్రాజ్య పట్టాభిషేకానికి రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పర్యటన ఖరారైనట్లు సమాచారం. పట్టాభిషేకం అనంతరం దుమ్ముగూడెం మండలంలోని పర్ణశాల క్షేత్రాన్ని సైతం గవర్నర్ దర్శించనున్నారని విశ్వసనీయంగా తెలిసింది. ఈ మేరకు బందోబస్తు ఏర్పాట్లు చేయాలని తెలంగాణ, ఏపీ రాష్ట్రాల పోలీస్ ఉన్నతాధికారులకు రాజ్‌భవన్ నుంచి ఆదేశాలు జారీ అయినట్లు సమాచారం. ఇక శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవానికి ఈ ఏడాదైనా సీఎం కేసీఆర్ హాజరవుతారా లేదా అనే విషయమై ఇప్పటివరకు స్పష్టత రాలేదు. జిల్లా, ఆలయ అధికారులు మాత్రం సీఎం పర్యటనకు తగినట్టుగానే ఏర్పాట్లు చేస్తున్నారు.



యంత్రంతో ముత్యాల తలంబ్రాలను ప్యాకింగ్ చేస్తున్న దృశ్యం

కొనసాగుతున్న శ్రీరామాయణ క్రతువు



హోమం చేస్తున్న అర్చకులు

పుష్కర సామ్రాజ్య పట్టాభిషేకం సందర్భంగా ఈనెల 22న ప్రారంభించిన శ్రీరామాయణ క్రతువు యాగశాలలో నిర్విఘ్నంగా కొనసాగుతోంది. రుత్విక్‌లు చతుర్వేద హవనాలతో పాటు రామాయణ హవనం చేస్తుండగా, మరో పక్కన వేద పండితులు రామషడాక్షరీ, నారాయణ అష్టాక్షరి మంత్రాలను జపిస్తున్నారు. అనంతరం రుత్విక్‌లు సంక్షేప రామాయణ సామూహిక పారాయణం చేపట్టారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

శ్రీరామనవమి సందర్భంగా చేపట్టిన పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ అనుదీప్ సూచించారు. మిథిలా స్టేడియం, ఆలయ పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భక్తులు సెక్టార్‌లోకి వచ్చినప్పటి నుంచి బయటకు వెళ్లే వరకు వారికి ఏ సమస్యా రాకుండా చూడాల్సిన బాధ్యత ఇన్‌చార్జ్‌లుగా నియమించిన ప్రత్యేక అధికారులదేనని స్పష్టం చేశారు. నవమి, పట్టాభిషేకం వేడుకలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ కర్నాటి వెంకటేశ్వర్లు, ఆలయ ఈఓ రమాదేవి, ఆర్డీఓ రత్నకళ్యాణి, భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్, డీపీఓ రమాకాంత్, ఉద్యాన అధికారి మరియన్న, దేవస్థానం ఈఈ రవీందర్, ఆర్‌అండ్‌బీ ఈఈ భీమ్లా తదితరులు పాల్గొన్నారు.

ఇదో వెరైటీ..



క్రంచీ కప్పులు (బిస్కట్ కప్పులు)

- చాయ్ తాగండి.. కప్పు తినండి
- బిస్కట్ కప్పులో టీ విక్రయిస్తున్న సోదరులు
- 'గూడెం'లో న్యూ టేస్ట్

కొత్తగూడెంటౌన్: ఏదైనా హోటల్‌కు, లేదా టీ కొట్టుకు వెళ్లి చాయ్ కావాలంటే సాధారణంగా గాజు గ్లాస్‌లు, పేపర్ గ్లాస్‌లు లేదంటే పింగాణి కప్పుల్లో అందిస్తారు. టీ తాగాక ఆ గ్లాస్ లేదా కప్పును అక్కడే వదిలేసి వస్తాం. కానీ కొత్తగూడెం రామవరంలోని వరలక్ష్మి టీ కార్నర్‌లో మాత్రం క్రంచీ కప్పులో చాయ్ పోస్తున్నారు. దీంతో టీ తాగిన తర్వాత ఆ కప్పును కూడా తినేయవచ్చు. ధర కూడా అన్ని టీ సెంటర్లలో మాదిరిగా రూ.10 మాత్రమే. ఇద్దరు సోదరులు వినూత్న ఆలోచనతో ఈ క్రంచీ కప్పు(బిస్కట్ కప్పు)ల్లో టీ అమ్ముతూ అందరినీ ఆకర్షిస్తున్నారు.

పర్యావరణానికి మేలు కలిగేలా..

రామవరానికి చెందిన అన్నదమ్ములు ఎర్రవెల్లి శ్రీనివాస్ డిగ్రీ, మనోజ్‌కుమార్ ఐటీఐ పూర్తి చేశారు. ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా స్వయం ఉపాధి సాధించేలా ఇటీవలే టీ స్టాల్‌ను ప్రారంభించారు. అయితే అందరిలా కాకుండా కొత్తగా ఏదైనా చేయాలని ఆలోచించారు. ఆ సమయంలోనే వారికి క్రంచీ కప్పుల గురించి తెలిసింది. ప్లాస్టిక్ రహితమైతే పర్యావరణానికి కూడా మేలు కలుగుతుందనే ఉద్దేశంతో ఈ కప్పులనే వినియోగించాలని నిర్ణయించారు. వెంటనే బెంగళూరు నుంచి ఈ కప్పులు తీసుకురావడం ప్రారంభించారు. రాగి, మొక్కజొన్న, బియ్యం పిండితో కలిపి తయారు చేసే ఒక్కో కప్పు ధర రూ.5 వరకు ఉంటున్నా.. వాటినే వినియోగిస్తున్నారు. టీ తాగాక కప్పును కూడా తినవచ్చని తెలియడంతో చాయ్ ప్రియులు ఈ టీ కార్నర్ వైపే పరుగులు తీస్తున్నారు. ఇదో కొత్త అనుభూతిని మిగులుస్తుందని చెబుతున్నారు. పర్యావరణానికి మేలు చేసేలా ప్లాస్టిక్ రహిత కప్పులను వినియోగిస్తున్న శ్రీనివాస్, మనోజ్‌కుమార్‌ను పలువురు అభినందిస్తున్నారు.



టీకార్నర్ నిర్వాహకులు శ్రీనివాస్, మనోజ్‌కుమార్

ఆలోచన బాగుంది



సాధారణంగా రోజూ టీ తాగుతుంటాం. కానీ ఇప్పుడు టీ తాగాక కప్పు తినడం బాగుంది. టీ సెంటర్ నిర్వహిస్తున్న శ్రీనివాస్, మనోజ్‌కుమార్ సోదరుల కొత్త ఆలోచన బాగుంది. టీతో పాటు కప్పులు కూడా రుచికరంగా ఉంటున్నాయి.

– దిలీప్‌కుమార్, రామవరం

సరికొత్త అనుభూతి



రామవరం సెంటర్లో ఇలాంటి టీ కొట్టు పెట్టడం బాగుంది. టీ తాగిన తర్వాత టీ కప్పు తినడం సరికొత్త అనుభూతిని కలిగిస్తోంది. ఇప్పటి వరకు టీ తాగి ప్లాస్టిక్, గాజు కప్పులు అక్కడే పడేసేవాళ్లం. క్రంచీ కప్పు రుచి కూడా బాగుంది.

– తేలుకుంట్ల రామ్‌కుమార్, రామవరం

రుచికరంగా ఉంది



వెరైటీగా బిస్కట్ కప్పులో టీ తాగడం కొత్తగా ఉంది. ఇక్కడ టీతో పాటు కప్పులు కూడా రుచికరంగా ఉన్నాయి. ఆరోగ్యానికి, పర్యావరణానికి మేలు కలుగుతుందని అందరూ అంటున్నారు. క్రంచీ కప్పుల్లో టీ అమ్మడం అభినందనీయం.

– సమ్మయ్య, రామవరం

సమష్టి కృషితోనే అవార్డులు

- కలెక్టర్ అనుదీప్
- 'ఉత్తమ' సర్పంచ్‌లకు సన్మానం

చుంచుపల్లి: జిల్లాలోని పలు గ్రామ పంచాయతీలు జాతీయ స్థాయి అవార్డులకు అర్హత సాధించాయంటే ప్రజాప్రతినిధులు, పంచాయతీ సిబ్బంది సమష్టి కృషి ఫలితమేనని కలెక్టర్ అనుదీప్ అన్నారు. ఉత్తమ అవార్డులకు ఎంపికైన గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులను ఐడీఓసీలో శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 10 మండలాల్లోని 17 గ్రామ పంచాయతీలు 27 అంశాల్లో జాతీయ స్థాయి అవార్డులకు అర్హత సాధించి రోల్ మోడల్‌గా నిలిచాయని తెలిపారు. గ్రామ పంచాయతీల్లో సమస్యలను ఎప్పటికప్పుడు ప్రజాప్రతినిధులు, కార్యదర్శులు, మండల, జిల్లా అధికారులు సమీక్షించుకుంటూ సమన్వయంతో ముందుకుపోతున్నారని అన్నారు. మూడేళ్ల క్రితం పంచాయతీల్లో అనేక సమస్యలు ఉండేవని, నేడు ప్రతి గ్రామం డంపింగ్ యార్డులు, నర్సరీలు, పల్లె, బృహత్ ప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాలు, ట్రాక్టర్లు, ట్యాంకర్లు, వైకుంఠధామాలతో అభివృద్ధికి నాంది పలుకుతున్నాయని వివరించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ విద్యాలత, డీఆర్డీఓ మధుసూదన్ రాజు, డీపీఓ రమాకాంత్, డిప్యూటీ సీఈఓ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి అభినందన

సూపర్‌బజార్(కొత్తగూడెం): క్షయ వ్యాధి నిర్మూలనలో రాష్ట్రంలో జిల్లా రజిత పతకం సాధించిన సందర్భంగా డీఎంహెచ్ఓ శిరీష, జిల్లా అదనపు క్షయ నివారణాధికారి శ్రీనివాసరావు కలెక్టర్ అనుదీప్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమష్టి కృషితో భవిష్యత్‌లో బంగారు పతకం సాధించాలని ఆకాంక్షించారు.



చల్లసముద్రం సర్పంచ్, కార్యదర్శులను సన్మానిస్తున్న కలెక్టర్, డీపీఓ

కార్యక్రమంలో డీడీఎంహెచ్ఓ సుకృత, స్టేట్ కన్సల్టెంట్ జె.వి. శ్రీనివాసరావు, చైతన్య, ఇమ్మానియేల్, దుర్గ పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్లకు ధ్రువీకరణ పత్రాలు

ప్రభుత్వ సంక్షేమ పథకాలతోపాటు విద్య, ఉపాధి అవకాశాలు పొందడానికి ట్రాన్స్‌జెండర్లకు ఐడీ కార్డులు, ధ్రువీకరణ పత్రాలు ఉపయోగపడతాయని కలెక్టర్ అన్నారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వారికి ఐడీ కార్డులు అందించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి స్వర్ణలత లెనీనా, వరప్రసాద్, నరేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

'పోషణ్ పక్వాడ'ను పటిష్టంగా నిర్వహించాలి

కొత్తగూడెంఅర్బన్: గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహార ప్రాముఖ్యతపై అవగాహన కల్పించేందుకు పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించాలని కలెక్టర్ అనుదీప్ అన్నారు. సంబంధిత పోస్టర్లను శనివారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 20న ప్రారంభమైన ఈ కార్యక్రమం ఏప్రిల్ 3 వరకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో మహిళా సంక్షేమాధికారి లేనీనా, జెడ్పీ సీఈఓ విద్యాలత, డీఆర్డీఓ మధుసూదన్‌రాజు, డీపీఓ రమాకాంత్, డీపీఆర్ఓ శ్రీనివాస్, డిప్యూటీ సీఈఓ నాగలక్ష్మి పాల్గొన్నారు.

మళ్లీ కేసీఆరే సీఎం

- ఎంపీ నామ నాగేశ్వరరావు



మాట్లాడుతున్న నామ, పక్కన రాములునాయక్

జూలూరుపాడు: రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ విజయం సాధిస్తుందని, కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని వెంగన్నపాలెంలో శనివారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికలకు కార్యకర్తలంతా సంసిద్ధులై బీఆర్ఎస్ సత్తా చూపాలని పిలుపునిచ్చారు. చిన్నచిన్న పొరపచ్చాలను పక్కన బెట్టి ఐక్యంగా పని చేయాలని కోరారు. ఎమ్మెల్యే రాములునాయక్ మాట్లాడుతూ పార్టీ విజయం కోసం ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలన్నారు. సీఎం కేసీఆర్ పిలుపు మేరకు పండుగ వాతావరణంలో ఆత్మీయ సమ్మేళనాలు జరుపుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పొన్నెకంటి సతీష్ కుమార్, రైతు బంధు జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు, జిల్లా టెలీకం సలహా మండలి సభ్యులు చిత్తారు సింహాద్రియాదవ్, ఉప్పునూతల నాగేశ్వరరావు, జెడ్పీటీసీ భూక్యా కళావతి, ఎంపీపీ లావుడ్యా సోనీ, నాయకులు ఎల్లంకి సత్యనారాయణ, గిరిబాబు, వేల్పుల నరసింహారావు, చౌడం నరసింహారావు, నున్నా రంగారావు, ఎదళ్లపల్లి వీరభద్రం, గాదె నిర్మల, కోటేశ్వరావు, దొండపాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

యోగా అందరికీ చేరువవ్వాలి

కొత్తగూడెంఅర్బన్: యోగా విద్య ప్రతి విద్యార్థికి చేరువవ్వాలని డీఈఓ సోమశేఖర శర్మ అన్నారు. జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులకు ఐదు రోజులుగా నిర్వహిస్తున్న యోగా శిక్షణ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. పీఈటీలు ఇక్కడ నేర్చుకున్న శిక్షణ అంశాలను సాధన చేయటంతో పాటు విద్యార్థులకు నేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో విద్యాశాఖ అకడమిక్ మానిటరింగ్ అధికారి నాగరాజశేఖర్, సమ్మిళిత విద్య కో-ఆర్డినేటర్ సైదులు, సతీష్ కుమార్, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఎస్.మాధవరావు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి స్టెల్లా మేరీ తదితరులు పాల్గొన్నారు.



యోగా చేస్తున్న డీఈఓ, ఉపాధ్యాయులు

భద్రాద్రికి తీరని ద్రోహం చేశారు..

- రూ.100 కోట్లు, 1000 కోట్ల హామీలు ఏమయ్యాయి ?
- రామయ్య హుండీలో రూపాయి కూడా వేయని గొప్ప భక్తుడు కేసీఆర్..
- కలిసొచ్చే మిత్రులతో ముందుకు సాగుతాం
- ఆత్మీయ సమ్మేళనంలో మాజీ ఎంపీ పొంగులేటి



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పక్కన నాయకులు

భద్రాచలం: భద్రాద్రి రామయ్యతో పాటు ఈ నియోజకవర్గ ప్రజలకు సీఎం కేసీఆర్ అడుగడుగునా ద్రోహం చేశారని ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శనివారం నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన పొంగులేటికి బ్రిడ్జి సెంటర్ వద్ద అభిమానులు, అనుచరులు ఘనంగా స్వాగతం పలకగా, అక్కడి నుంచి కళాశాల వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య అధ్యక్షతన జరిగిన సభలో పొంగులేటి మాట్లాడుతూ.. కేసీఆర్ అధికారంలోకి వచ్చాక భద్రాచలంలో ఎనిమిది సార్లు శ్రీరామ నవమి వేడుకలు జరిగితే ఒక్కసారి మాత్రమే హాజరయ్యారని, భద్రాచలం అభివృద్ధికి రూ.100 కోట్లు, గోదావరి వరద బాధితులకు రూ.1000 కోట్లు ప్రకటించి ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని విమర్శించారు. రామయ్య హుండీలో కనీసం రూపాయి కూడా వేయని గొప్ప భక్తుడని ఎద్దేవా చేశారు. దివంగత నేత వైఎస్సార్ ఇళ్లు నిర్మించి ఇస్తే ప్రజలు గుండెల్లో పెట్టుకుని ఇప్పటికీ పూజిస్తున్నారని, ప్రజలకు అలాంటి పాలన అందించాలి తప్ప అమలు చేయని హామీలతో మోసం చేయవద్దని హితవు పలికారు. నీళ్లు, నిధులు, నియామకాలతో సాధించుకున్న తెలంగాణలో అవన్నీ కల్వకుంట్ల కుటుంబానికే చేరుతున్నాయని విమర్శించారు. భద్రాచలం అభివృద్ధికి కట్టుబడి ఉన్న డాక్టర్ తెల్లం వెంకట్రావ్‌ను ఈ సారి ఎన్నికల్లో గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కలిసి వచ్చే మిత్రులతో పాటు ముందుకు సాగుతామని, జెండా ఏదైనా ఎజెండా ఒక్కటేనని, అది సీఎం కేసీఆర్‌ను గద్దె దించడమేనని స్పష్టం చేశారు. అనంతరం తెల్లం వెంకట్రావ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ అవినీతిని, అభివృద్ధిని ప్రశ్నించినందుకు గన్‌మెన్‌లను రద్దు చేశారని, ఏజెన్సీ అభివృద్ధిని మాత్రం మరిచిపోయారని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత భద్రాచలం ఆలయానికి కనీసం పాలకమండలిని సైతం నియమించలేదని విమర్శించారు. వరద బాధితులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే శ్రీనన్న వారికి ఆపన్న హస్తం అందించారని, ప్రజా సేవ చేయడానికి ఆయన అడుగుజాడల్లోనే నడుస్తానని అన్నారు. పినపాక మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన ఐటీడీఏ నిధుల లేమితో నిస్తేజంగా మారిందన్నారు. తనతో పాటు కోరం కనకయ్య, తెల్లం వెంకట్రావ్‌లకు గన్‌మెన్‌లను ఉపసంహరించి గిరిజనులపై కేసీఆర్ వివక్ష చాటారని విమర్శించారు. జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య మాట్లాడుతూ.. జిల్లాలో గిరిజనులకు ఒక్క ఎకరాకు కూడా పోడు హక్కు పత్రాలను ఇవ్వలేదని ఆరోపించారు. గిరిజనుల అభివృద్ధి విషయంలో బీఆర్ఎస్ సర్కార్ ఘోరంగా విఫలమైందన్నారు. సభలో డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వ విజయ్‌బాబు, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి, అశ్వారావుపేట, వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు జారే ఆదినారాయణ, విజయాబాయి, బొర్రా రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. సభ అనంతరం తెల్లం వెంకట్రావ్ క్యాంప్ కార్యాలయాన్ని పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు.

క్లుప్తంగా

అధిక కౌలు వసూలు చేయొద్దు

మావోయిస్టు చర్ల శబరి ఏరియా కమిటీ కార్యదర్శి

చర్ల: సాగుదారుల నుంచి అధిక కౌలు వసూలు చేసే భూస్వాములు మూల్యం చెల్లించక తప్ప దని మావోయిస్టు పార్టీ హెచ్చరించింది. ఈ మేరకు పార్టీ చర్ల శబరి ఏరియా కమిటీ కార్యదర్శి అరుణ ఒక లేఖ విడుదల చేశారు. లేఖలోని వివరాల ప్రకారం.. మిర్చి సాగు చేసే ఎకరం భూమికి రూ. 30 వేల నుంచి రూ.50 వేల లోపు కౌలు ఉండాల్సిఉండగా, రూ.లక్ష నుంచి రూ. 1.20 లక్షల వరకు పెంచి వసూళ్లు చేస్తు న్నారని ఆరోపించారు. చర్ల మండలంలో గల గోదావరి లంక భూములు ఉన్న వీరాపురం, జీపీపల్లి, ఎంపీపల్లి, చింతకుంట, సీ.కత్తిగూడెం, మొగళ్లపల్లి, గొంపల్లి, లింగాపురం, కొత్తపల్లి, తేగడ, కుదునూరు, సత్యనారాయణపురం గ్రామాల్లో గల షెడ్యూల్డ్ ప్రాంతంలో కొందరు పెత్తందార్లు తమ భూముల కౌలు విపరీతంగా పెంచి సామాన్య రైతులను వ్యవసాయానికి దూరం చేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే పలువురు రైతులు సీతమ్మ సాగర్ కరకట్ట నిర్మాణంతో కోరెగడ్డ భూములు కోల్పోతూ రోడ్డున పడుతున్నారని పేర్కొన్నారు. భూస్వామ్య బ్రోకర్లుగా ఉన్న వలస గిరిజనేతరులు 15 ఎకరాల లోపు భూమిని మాత్రమే సాగు చేసుకోవాలని, భూస్వామ్య పెత్తందారులు ఇకనైనా వారి పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. లేకపోతే భూస్వాముల భూముల్లో ఎర్రజెండాలు పాతాల్సి వస్తుందని, వారు తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు.

116 కేజీల గంజాయి స్వాధీనం



పట్టుకున్న గంజాయి, నిందితులతో ఎక్సైజ్ పోలీసులు

కొత్తగూడెంఅర్బన్: నిషేధిత గంజాయిని ఒడిశా నుంచి హైదరాబాద్ తరలిస్తుండగా ఎక్సైజ్ అధికారులు శనివారం పట్టుకున్నారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటిండెంట్ పి.కరమ్‌చంద్ కథనం ప్రకారం.. లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని ఇల్లెందు క్రాస్ రోడ్డులో వాహనాల తనిఖీలు చేస్తున్న క్రమంలో బైక్, కారు అనుమానాస్పదంగా కనిపించాయి. రెండు వాహనాలను ఆపి తనిఖీ చేయగా 116 కేజీల గంజాయి లభించింది. దీంతో నిందితులైన నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి కొత్తగూడెం స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటిండెంట్ తెలిపారు. వాహనాల తనిఖీలో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ ఎస్సై ఆర్.రాజు, ఎస్సై అశోక్‌కుమార్, కె.గౌతమ్, సాయికుమార్, హెడ్‌కానిస్టేబుల్ రామకృష్ణ, హబీబ్, కానిస్టేబుళ్లు సుమంత్‌కన్నా, రాము, సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీ : ఇద్దరికి గాయాలు

కొత్తగూడెంటౌన్: పట్టణ పరిధిలోని హెడ్ ఆఫీస్ సంత సమీపంలో బైపాస్ రోడ్డు వద్ద మున్సిపాలిటీ కబేళా ముందు రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలైన సంఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. రామవరం బిల్డింగ్ ఆఫీస్ వెనుక నివాసం ఉంటున్న సీనియర్ న్యాయవాది గంటా వీరభద్రం బైపాస్ రోడ్డు మీదుగా రామవరం వస్తున్నాడు. అదే సమయంలో కొత్తగూడెం మున్సిపాలిటీలో కాంట్రాక్ట్ వర్కర్‌గా పని చేస్తున్న హనుమాన్ బస్తీకి చెందిన జిమ్ సంతోష్ కుమార్ కబేళా దారిలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఇద్దరికి గాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై తమకు ఫిర్యాదు రాలేదని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.


కలప పట్టివేత



అటవీఅధికారులు పట్టుకున్న కలప ట్రాక్టర్

అశ్వారావుపేటరూరల్: అనుమతులు లేకుండా అక్రమంగా ట్రాక్టర్‌లో తరలిస్తున్న కలపను శనివారం అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. ఏపీలోని ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం పూచికపాడు గ్రామానికి చెందిన కొందరు మండలంలోని మారుమూల అటవీ ప్రాంతంలో ఉన్న కంట్లం గ్రామంలో అక్రమంగా టేకు చెట్లను నరికి ట్రాక్టర్‌లో తరలిస్తున్నారు. దీంతో ఫారెస్ట్ రేంజర్ అబ్దుల్ రెహమాన్ సిబ్బందితో కలిసి దాడి చేసి పట్టుకున్నారు. ట్రాక్టర్, టేకు దిమ్మెలను అశ్వారావుపేట ఫారెస్ట్ రేంజ్ కార్యాలయానికి తరలించి కేసు నమోదు చేశారు.

వ్యక్తి ఆత్మహత్య



మధుసూదన్ (ఫైల్)

ఇల్లెందురూరల్: మండలంలోని సుభాష్‌నగర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గోదావరిఖనిలో శనివారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. సుభాష్‌నగర్‌కు చెందిన మధుసూదన్ (43) గోదావరిఖనిలోని సింగరేణి ప్రాంతంలో ప్రైవేటు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని మృతి చెందాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. మృతదేహాన్ని స్వగ్రామం సుభాష్‌నగర్‌కు తరలిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

కొలువుదీరిన ‘పెద్దమ్మతల్లి’ పాలకవర్గం



ప్రమాణస్వీకారం అనంతరం ఎమ్మెల్యే వనమాతో పాలకవర్గ సభ్యులు

చైర్మన్ సహా 15 మంది సభ్యుల ప్రమాణస్వీకారం

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి ఆలయ కమిటీ నూతన పాలకవర్గం కొలువుదీరింది. మండల పరిధిలోని కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయానికి 15మంది సభ్యులతో కూడిన పాలకవర్గాన్ని నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. గత పాలకవర్గంలో ఉన్న 12 మందికి అదనంగా మరో ముగ్గురిని నియమించింది. దీంతో ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు సమక్షంలో శనివారం పెద్దమ్మతల్లి అమ్మవారి సన్నిధిలో పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఏడాదిపాటు కొనసాగనున్న 6వ పాలకవర్గం చైర్మన్‌గా మహిపతి రామలింగం, డైరెక్టర్లుగా ఎస్‌వీఆర్‌కే ఆచార్యులు, బేతంశెట్టి విజయ్‌కుమార్, చింత నాగరాజు, ముత్యాల ప్రవీణ్‌కుమార్, ఆడెపు చిన్నవెంకట్రామయ్య, మాలోత్ సువాలి, కాటారపు లక్ష్మీనారాయణ, చందుపట్ల శ్రీనివాసరెడ్డి, గంధం వెంగళరావు, కిలారు నాగమల్లేశ్వరరావు, బండి చిన్నవెంకటేశ్వర్లు, సంకా రామారావు, పాయం పాపయ్య, ఎక్స్‌అఫీషియో సభ్యులుగా శ్రీమూర్తి రవికుమార్‌శర్మలతో దేవాదాయశాఖ కొత్తగూడెం డివిజన్ పరిశీలకులు పి.బేల్‌సింగ్, ఆలయ ఈఓ ఎస్.రజనీకుమారి ప్రమాణ స్వీకారం చేయించారు.

ఘనంగా సత్కారం

పెద్దమ్మతల్లి ఆలయ కమిటీ ప్రమాణస్వీకారోత్సవం అనంతరం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావుతో పాటు నూతన ఆలయ చైర్మన్ మహిపతి రామలింగం, డైరెక్టర్లను శాలువలతో ఘనంగా సత్కరించారు. అనంతరం అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్‌చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మల్లెల శ్రీరాంమూర్తి, పట్టణ అధ్యక్షుడు ఎం.రాజ్‌గౌడ్, నాయకులు పూసల విశ్వనాథం, బండ్లపల్లి వెంకటనారాయణ, మాజీ జెడ్పీటీసీ నందానాయక్, కొండం పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రామయ్య సేవలో హైకోర్టు జడ్జి శరత్



రామాలయంలో కుటుంబ సభ్యులతో హైకోర్టు న్యాయమూర్తి కె.శరత్

భద్రాచలం/భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామివారిని శనివారం రాష్ట్ర హైకోర్టు జడ్జి, భద్రాచలం వాసి కె.శరత్ తన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. అంతరాలయంలో మూలమూర్తులకు, ఆలయ ప్రాంగణంలోని ఉపాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పట్టణంలోని హరిహర క్షేత్రాన్ని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అర్చకులు వేదాశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. అడుసుమిల్లి జగదీష్, పరిమి శ్రీనివాసరావు, బుద్దా నరసింహారావు, కొడాలి శ్రీనివాసన్, ఆకుల సత్యనారాయణ, బాచినేని రాంబాబు, దాసయ్య పాల్గొన్నారు.

ఆపన్నహస్తం అందించరూ..

దీనగాథ

తలలో గడ్డతో ప్రాణాపాయ స్థితిలో యువకుడు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పవన్‌కల్యాణ్

అశ్వాపురం: తండ్రి దివ్యాంగుడు. నిరుపేద కుటుంబం. చేతికి ఎదిగిన కొడుకు తలలో గడ్డ ఏర్పడి ప్రాణాపాయ స్థితిలో ఉండటంతో ఆ కుటుంబం మనోవేదనకు గురవుతోంది. చికిత్స అందించేందుకు కుటుంబం దాతలసాయం కోసం ఎదురుచూస్తోంది. మండల పరిధిలోని అమెర్ద గ్రామ పంచాయతీ అంబేడ్కర్‌నగర్ గ్రామానికి చెందిన యువకుడు తోకల పవన్‌కల్యాణ్(22) తలలో గడ్డ ఏర్పడి కొంతకాలంగా బాధపడుతున్నాడు. వైద్యానికి ఆర్థిక స్తోమత లేక ఇబ్బంది పడుతున్నారు. తండ్రి తోకల వెంకటేశ్వర్లు దివ్యాంగుడు కావడంతో పనిచేయాలని పరిస్థితి. పవన్‌కల్యాణ్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. దాతలు, ప్రభుత్వం స్పందించి తన కుమారుడు ప్రాణాలు కాపాడాలని తండ్రి వెంకటేశ్వర్లు కోరుతున్నాడు.

దాతలు 96405 09622 నంబర్‌కు ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా ఆర్థికసాయం అందించాలని వేడుకుంటున్నాడు.

ఇల్లు అమ్మి వైద్యం అందించినా మెరుగుపడని ఆరోగ్యం



వైద్య సేవలు పొందుతున్న నాగేశ్వరరావు

బూర్గంపాడు: ఓ పేద కుటుంబానికి పెద్దకష్టం వచ్చిపడింది. రెండు కిడ్నీలు పాడైన ఇంటి యజమాని వైద్యం కోసం అందినకాడికి అప్పులు చేశారు. చివరకు ఉండే ఇల్లు అమ్మి కూడా వైద్యం చేయించారు. అయినా ఫలితం లేదు. సారపాకలోని గాంధీనగర్‌కు చెందిన కొప్పుల నాగేశ్వరరావు ఐటీసీ పీఎస్‌పీడీలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. 2017లో అనారోగ్యం పాలయ్యాడు. రెండు కిడ్నీలు బాగా దెబ్బతిన్నాయి. దీంతో కుటుంబసభ్యులు ఇంట్లో ఉన్న బంగారం, ఇల్లు అమ్మి చికిత్స అందించా రు. అప్పటికీ సరిపోకపోవడంతో అప్పులు కూడా చేశారు. నాటి నుంచి నేటి వరకు అతని వైద్యసేవల కోసం కుటుంబసభ్యులు అప్పులు చేశారు. ఇంట్లో ఉన్న బంగారం అమ్మేశారు. అయినా ఆరోగ్యం మెరుగుపడలేదు. ఇంకా కొంతకాలం వైద్యసేవలు తప్పనిసరి అని వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుతం ఇల్లు గడవటమే కష్టంగా మారిన తరుణంలో అతని వైద్యఖర్చులకు చేతిలో చిల్లిగవ్వలేదని కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాతలు స్పందించి సాయమందించాలని వేడుకుంటున్నారు.

ఆర్థికసాయం చేయదలిచిన వారు ఫోన్ పే నంబర్ 97059 30048కు, అకౌంట్ నంబర్ 30331369728 (సారపాకలోని ఎస్‌బీఐ బ్రాంచ్)కు ట్రాన్స్‌ఫర్ చేయాలని కోరుతున్నారు.

భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు

- భద్రాచలం రామాలయ ఈఓ రమాదేవి
- ‘పర్ణశాల’లో నవమి ఏర్పాట్లపై సమీక్ష



గోదావరి ఒడ్డున పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

దుమ్ముగూడెం: మండలంలోని పర్ణశాల రామాలయంలో ఈనెల 30న జరగనున్న శ్రీరామనవమికి హాజరయ్యే భక్తులకు ఇబ్బంది ఎదురుకాకుండా ఏర్పాట్లుచేయాలని భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయ ఈఓ రమాదేవి సూచించారు. ఈమేరకు శనివారం ఆమె ఆలయాన్ని సందర్శించి ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. నవమి రోజున జరిగే సీతారాముల వారి కల్యాణానికి భారీ స్థాయిలో భక్తులు హాజరుకానున్నందున తాగునీరు, పారిశుద్ధ్య పనులు, స్నాన ఘట్టాల ఏర్పాట్లు త్వరగా పూర్తిచేయాలని తెలిపారు. అలాగే, తలంబ్రాల కౌంటర్లు, ప్రసాద కౌంటర్లు ఎక్కువగా ఏర్పాటు చేయాలని తెలిపారు. భక్తులకు ఎండ తగలకుండా దారి పొడువునా టెంట్లు ఏర్పాటు చేయాలని, స్నానాల ఘట్టాల వద్ద బారికేడ్లు ఏర్పాటుచేసిన గజ ఈతగాళ్లను నియమించాలని చెప్పారు. కాగా, జల ప్రసాద పథకం కింద రూ.9లక్షల వ్యయంతో కూలింగ్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నట్లు ఈఓ తెలిపారు. ఈ సమీక్షలో తహసీల్దార్ చంద్రశేఖర్, సీఐ దోమల రమేష్, ఎస్సైలు రవికుమార్, కేశవ్, ఈఈ రవీంద్ర, సర్పంచ్ వరలక్ష్మి, కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, సీసీ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన అదనపు కలెక్టర్

పర్ణశాలలో శ్రీరామనవమికి జరుగుతున్న ఏర్పాట్లను ఇరిగేషన్ అధికారులతో కలిసి అదనపు కలెక్టర్ కర్నాటి వెంకటేశ్వర్లు పరిశీలించారు. గోదావరి ఒడ్డున సీతమ్మ సాగర్ కరకట్ట పనులు జరుగుతున్న నేపథ్యాన భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు అనువైన ప్రదేశాలు గుర్తించాలని సూచించారు. ఇరిగేషన్ ఈఈ రాంప్రసాద్, జేఈ రాజ్‌సుహాస్, సిబ్బంది మస్తాన్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

31న పర్ణశాలకు గవర్నర్?

భద్రాచలంలో ఈనెల 31న జరిగే శ్రీసీతారామచంద్ర స్వామి పుష్కర పట్టాభిషేకానికి హాజరుకానున్న గవర్నర్ తమిళిసై సౌందర్యరాజన్ ఆతర్వాత పర్ణశాల ఆలయాన్ని కూడా సందర్శించనున్నారని సమాచారం. ఈ విషయమై ఇప్పటికే ఆలయ అధికారులకు సమాచారం వచ్చినట్లు తెలిసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు గవర్నర్ రావడం నాలుగో సారి కాగా.. ఏజెన్సీ ప్రాంతమైన దుమ్ముగూడెం మండలం పర్ణశాలకు రావడం మాత్రం ఇదే తొలిసారి అవుతుంది. భద్రాచలం నుండి పర్ణశాలకు 35 కి.మీ. రోడ్డు మార్గంలో గవర్నర్ వస్తారని మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కావడంతో పాటు భద్రాచలం దాటాక తర్వాత సుమారు ఏడు కి.మీ. మేర ఆంధ్రప్రదేశ్ పరిధిలో ఉంటుంది. అయితే, గవర్నర్ పర్యటన విషయమై జిల్లా అధికారుల నుండి స్పష్టత రావాల్సి ఉంది.

వేల్పుల గుట్ట ఆక్రమణపై విచారణ

అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు



విచారణకు వచ్చిన అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తురాలు

పాల్వంచరూరల్: వేల్పుల గుట్ట ఆక్రమణపై అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు శనివారం విచారణ జరిపారు. మండల పరిధిలోని పాండురంగాపురం గ్రామశివారు ప్రభుత్వ సర్వే నంబర్ 126/1 ఎకో సెన్సిటివ్ జోన్ పరిధిలో వేల్పుల గుట్ట ఉన్నది. కాగా సర్వేయర్ నాగరాజు తప్పుడు లొకేషన్ ఇచ్చిన మూలంగా 2020లో అక్రమంగా గ్రావెల్ తోలకాలు జరిగాయి. దీంతో కలెక్టర్, సీసీఎల్ఏ, తహసీల్దార్‌కు పలుమార్లు ఫిర్యాదులు అందాయి. గతంలో ఆర్డీఓ స్వర్ణలత కూడా ఇక్కడ విచారణ జరిపారు. విచారణ క్రమంలో ఏడాది తర్వాత 126 సర్వే నంబర్ పూర్తిగా కొలిస్తేనే వాస్తవాలు వెల్లడవుతాయని అధికారాలు తేల్చిచెప్పారు. దీంతో గ్రామానికి చెందిన మాలోత్ లీల అనే మహిళ మరోసారి ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. స్పందించిన కలెక్టర్.. అడిషనల్ కలెక్టర్‌ను విచారణ అధికారిగా నియమించారు. కాగా అడిషనల్ కలెక్టర్ శనివారం గుట్టను సందర్శించి విచారణ జరిపారు. మైనింగ్ శాఖ నుంచి కూడా నివేదిక తీసుకున్నారు. విచారణలో మైనింగ్ ఏడీఈ జైసింగ్, జిల్లా సర్వేయర్ కుసుమ కుమారి, తహసీల్దార్ రంగాప్రసాద్, కలెక్టర్ కార్యాలయ అడ్మినిస్ట్రేషన్ అధికారి గన్యానాయక్, రెవెన్యూ ఆర్ఐ హచ్యా పాల్గొన్నారు. కాగా ఈ సందర్భంగా మాలోతు లీల అడిషనల్ కలెక్టర్‌కు కూడా వినతి పత్రాన్ని అందజేశారు.

ఐటీడీఏ ఏపీఓకు హైకోర్టు నోటీసులు

భద్రాచలం: గిరిజన సంక్షేమ శాఖలో పార్ట్ టైం ఉద్యోగ నియామకంలో న్యాయస్థానం ఉత్తర్వులు అమలు చేయకపోవడంతో ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్‌కు రాష్ట్ర హైకోర్టు షోకాజ్ నోటీసు జారీ చేసింది. పార్ట్ టైం అధ్యాపకుడి నియామకంపై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.మాధవి దేవి 2002, ఆగస్టు 29న డబ్ల్యూపీ నెం.33658/2022 ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను అమలు చేయడంలో ఏపీఓ డేవిడ్ రాజ్ అలసత్వం వహించారు. దీంతో న్యాయస్థానం ఆదేశాలను ధిక్కరించినందుకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ నెల 31న హైకోర్టుకు హాజరు కావాలని ఆదేశించింది.

స్పెషల్ బ్రాంచ్ సీఐగా సర్వయ్య

ఖమ్మంక్రైం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో స్పెషల్ బ్రాంచ్ సీఐగా సర్వయ్యను నియమిస్తూ ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి శనివారం ఉత్తర్వులు జారీచేశారు. ఖమ్మం త్రీటౌన్ సీఐగా విధులు నిర్వర్తిస్తున్న సర్వయ్యను ఇటీవల ఐజీకి అటాచ్ చేసిన విషయం విదితమే. తాజాగా ఆయనకు పోస్టింగ్ ఇచ్చారు.

ఆర్టీసీ బంక్‌లో డిజిటల్ సేవలు

సాక్షి ఎఫెక్ట్..

చుంచుపల్లి: కొత్తగూడెం ఆర్టీసీ పెట్రోల్ బంక్‌లో రెండు రోజుల నుంచి డిజిటల్ సేవలు ప్రారంభమయ్యాయి. డిజిటల్ చెల్లింపులు అందుబాటులో లేక కస్టమర్లు పడుతున్న ఇబ్బందులపై ఈ నెల 17న ‘సాక్షి’లో ‘‘బంక్‌లో డిజిటల్ సేవలు కరువాయే’’ శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన యాజమాన్యం శుక్రవారం నుంచి స్వైపింగ్ మిషన్‌తో పాటు డిజిటల్ సేవలను అందుబాటులో ఉంచింది. దీంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



లింగానాయక్ (ఫైల్)

జూలూరుపాడు: మండలంలోని కొమ్ముగూడెం గ్రామానికి చెందిన రైతు బానోతు లింగా నాయక్ (75) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. రైతు శనివారం వర్షం వస్తుండగానే వరి పొలం వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో విద్యుత్ మోటార్ స్విచ్ బంద్ చేసే క్రమంలో కరెంట్ షాక్‌కు గురై మృతి చెందాడు. మృతునికి భార్య కమలి, ఆరుగురు కుమార్తెలు ఉన్నారు. లింగానాయక్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

భూ వివాదంలో ఇరువర్గాల ఘర్షణ



చికిత్స పొందుతున్న మచ్చా శ్రీనివాసరావును పరామర్శిస్తున్న జెడ్పీ చైర్మన్ కనకయ్య

పాల్వంచరూరల్: శ్రీ ఆత్మలింగేశ్వరస్వామి ఆలయం వద్ద భూ వివాదంలో ఇరువర్గాల మధ్య శనివారం ఘర్షణ చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని పాతపాల్వంచ చింతల చెరువు కట్ట వద్ద ఉన్న ఆత్మలింగేశ్వరస్వామి ఆలయం వద్ద కొన్నేళ్లుగా భూవివాదం నెలకొన్నది. భూమి దేవస్థానానికి చెందినదంటూ ఆలయ నిర్మాణ బాధ్యుడు మచ్చా శ్రీనివాసరావు ఆలయ అభివృద్ధి పనులు చేపడుతున్నారు. కాగా గుడి నిర్మాణంలో తన భూమి కొంత ఆక్రమణకు గురైందంటూ కేటీపీఎస్ ఉద్యోగి, గొల్లగూడేనికి చెందిన రొడ్డ సీతారాములు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో కొంతకాలంగా వివాదం సాగుతోంది. ఈ విషయమై కోర్టులో కేసులు సైతం నడుస్తున్నాయి. ఈ క్రమంలో శనివారం రొడ్డ సీతారాములు, అతని సోదరుడు రాంమూర్తి, మరికొందరితో కలిసి వచ్చి ఆలయం గోశాల వద్ద సిమెంట్ స్తంభాలు, కర్రలను తొలగించారు. ఈ క్రమంలో అక్కడే ఉన్న మచ్చా శ్రీనివాసరావు, మరికొందరు కలిసి అడ్డుకునే ప్రయత్నంచేశారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి విచారణ జరిపారు. ఈ ఘటనలో గాయపడ్డ మచ్చా శ్రీనివాసరావు చికిత్స పొందుతుండగా, జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా తనతోపాటు మరో ముగ్గురిపై కత్తులతో దాడి చేశారని మచ్చా తెలిపారు. కాగా మచ్చా శ్రీనివాసరావుతోపాటు మరో ఏడుగురు తమపై దాడి చేశారని బాధితుడు సీతారాములు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ నరేష్ తెలిపారు. మరో వర్గం నుంచి తమకు ఫిర్యాదు రాలేదని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

సుజాతనగర్: ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటనపై సుజాతనగర్ ఠాణాలో శనివారం కేసు నమోదైంది. ఎస్ఐ పి.తిరుపతిరావు కథనం ప్రకారం.. డబుల్ బెడ్ రూం ఇంట్లో నివాసం ఉంటున్న ధర్మసోత్ నరసింహారావు (33) శుక్రవారం రాత్రి నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్నాడు. ఈక్రమంలో రాఘవాపురం రోడ్డు మూలమలుపు వద్ద ద్విచక్రవాహనంపై వస్తున్న పోకలగూడెం గ్రామానికి చెందిన తేజావత్ రాంచందర్ అనే యువకుడు ఢీకొట్టాడు. దీంతో నర్సింహారావుకు తీవ్రగాయాలై మృతి చెందాడు. మృతుని భార్య దేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ముగ్గురిపై కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: దాడి ఘటనలో ముగ్గురిపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై బి.రాజేష్ కుమార్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని ఆసుపాక గ్రామానికి చెందిన పుచ్చకాయల రమేష్‌తో అదే గ్రామానికి చెందిన పొడపాక ప్రసాద్, శేఖర్, నాగాచారి కలిసి అప్పుగా ఇచ్చిన నగదు తిరిగి ఇవ్వాలని గొడవ పడ్డారు. రమేష్‌తోపాటు అతని కుటుంబీకులపై దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కుక్కల స్వైర విహారం



వినాయకపురం కాలనీలో సంచరిస్తున్న కుక్కలు

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని వినాయకపురం, వినాయకపురం కాలనీ, వడ్డెర బజారులో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. కొద్ది రోజులుగా పంచాయతీ పరిధిలో కుక్కల బెడద అధికమైందని, గుంపులు గుంపులుగా తిరుగుతూ చిన్నారులు, పెద్దలపై దాడి చేసి గాయపరుస్తున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. తాజాగా వినాయకపురం కాలనీ గ్రామానికి చెందిన ఎనిమిదేళ్ల బాలుడు కొండపల్లి మనీష్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. పదుల సంఖ్యలో కుక్కలు పగలు, రాత్రి వీధుల్లో ప్రధాన రహదారిపై సంచరిస్తుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.